మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి..?



సింగరాయకొండ రెవెన్యూ కార్యాలయం భవనం



కార్యాలయం గోడల్లో పెరిగిన రావిచెట్టు కొమ్మలు

- అధికారులకు సౌకర్యాలు లేవు.. రికార్డులకు భద్రత లేదు
- అధ్వాన స్థితిలో రెవెన్యూ కార్యాలయం
- కార్యాలయాన్ని ధ్వంసం చేసిన రావిచెట్టు
- చిన్నపాటి వర్షానికి కురుస్తున్న గదులు
- తడుస్తున్న విలువైన రికార్డులు
- మహిళా సిబ్బందికి మరుగుదొడ్ల సమస్య
- గ్రామ సచివాలయ భవనంలోకి మార్చాలంటున్న రెవెన్యూ సిబ్బంది

సింగరాయకొండ: ప్రజలకు ఏదైనా సమస్య వస్తే గుర్తొచ్చేది రెవెన్యూ కార్యాలయం, ఆ కార్యాలయ అధికారులు, సిబ్బందే. అంతటి ప్రాధాన్యం ఉంది రెవెన్యూ కార్యాలయానికి. అయితే మండలంలో ఆ కార్యాలయం అత్యంత అధ్వాన స్థితికి చేరుకుంది. వర్షానికి కారుతూ, రికార్డులు భద్రపరుచుకునేందుకు సరైన గదులు లేక, పనిచేయని విద్యుత్ వ్యవస్థ ఇలా ఎన్నో సమస్యలతో కార్యాలయం కునారిల్లుతోంది. ఇన్ని సమస్యలు ఉన్న కార్యాలయంలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించడం కత్తి మీద సాము లాంటిదే.

వర్షానికి కారుతున్న గదులు

ప్రజలకు సంబంధించిన ఎన్నో ముఖ్యమైన రికార్డులకు రెవెన్యూ కార్యాలయం నిలయం. భూముల సంబంధించిన వివరాలు, ప్రజలల జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఇళ్ల స్థల డాక్యుమెంట్లు అన్ని ఈ శాఖ ఆధ్వర్యంలోనే ఉంటాయి. పేదవానికి ఇళ్ల స్థలం కేటాయించాలన్నా, సాగు భూమి కేటాయించాలన్నా ఈ శాఖ అధికారుల పరిధిలోనే ఉంటుంది. కార్యాలయం మొత్తం వర్షానికి కారుతుండటంతో రికార్డులకు భద్రత కరువైంది. దీంతో ఇనుప పెట్టెల్లో విలువైన రికార్డులు భద్రపరుచుకుంటున్నారు.



వర్షానికి తడిచిన కార్యాలయం గదులు

రావిచెట్టు బంధీలో రెవెన్యూ కార్యాలయం

రెవెన్యూ కార్యాలయంలో భారీ రావిచెట్టు ఉండటంతో దాని వేర్లు కార్యాలయ గోడల్లోకి వెళ్లడంతో చిన్నపాటి వర్షానికి కూడా గోడల్లో రంధ్రాలు ఏర్పడి వర్షం నీరు కారుతున్నాయి. ఒక్కోసారి విషపురుగులు కూడా కార్యాలయంలోకి వస్తూ సిబ్బందిని భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య వేధిస్తోంది. సిబ్బంది వర్షాల సమయంలో బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తించే పరిస్థితి.

వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య

కార్యాలయంలో రెవెన్యూ, సర్వేయర్ శాఖకు సంబంధించి సుమారు 50 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో సుమారు 12 మంది మహిళా సిబ్బంది ఉన్నారు. వీరితో పాటు కార్యాలయానికి వచ్చే పురుషులు, స్త్రీలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కేవలం ఒక్క తహశీల్దార్ గదిలో మాత్రమే బాత్ రూమ్ ఉంది. దీంతో సిబ్బంది కోసం మేడ మీద ఒక ఒక్క బాత్‌రూమ్ నిర్మించారు. అయితే దీనిని శుభ్రం చేసేవారు లేరు. అంతేకాక కార్యాలయానికి వచ్చే ప్రజలకు మరుగుదొడ్ల సమస్య వెంటాడుతోంది.

కనీస వసతులు కరువే.

సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కార్యాలయంలో చెద సమస్య ప్రధానంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బీకే భవనాలు ప్రారంభించకుండా ఉన్నాయని, వాటిలో ఏదో ఒక భవనం కేటాయిస్తే అటు ఉద్యోగుల సమస్య, ఇటు రికార్డు భద్రపరిచే సమస్య తీరుతుందని, ఏదో ఒక భవనం కేటాయించాలని రెవెన్యూ సిబ్బంది కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

రెవెన్యూ కార్యాలయంలో రావిచెట్టు పెరగటంతో దాని వేళ్లు గోడల్లోకి వెళ్లడంతో చిన్నపాటి వర్షానికి గదులు కురుస్తున్నాయి. చెదల సమస్య కూడా బాగా ఉంది. దీంతో కార్యాలయ రికార్డులకు భద్రత లేదు. కార్యాలయ కిటికీలు కూడా శిథిలావస్థకు చేరాయి. మండల కాంప్లెక్స్‌లో గ్రామ సచివాలయం, ఆర్‌బీకేల కోసం నూతన భవనాలు చాలా ఉన్నాయి. వాటిలో ఒక భవనం కేటాయిస్తే సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. కార్యాలయ రికార్డులు భద్రంగా ఉంటాయి.

– టి రవి, తహసీల్దార్

క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 80 విద్యార్థులకు కూటాగుండ్ల గ్రామానికి చెందిన దాత దేవిరెడ్డి శ్రీనివాసలరెడ్డి యూటీఎఫ్ వారు తయారు చేసిన స్టడీ మెటీరియల్ శుక్రవారం అందజేశారు. హెచ్ఎం బొపరాజు మాట్లాడుతూ దాతల సాయం అభినందనీయమన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయుడు చీకటి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు నాళి వెంకటయ్య, బ్రహ్మయ్య, రమణారెడ్డి, రామయ్య, నాగయ్య, ఆదిశేషారెడ్డి, ఓబులేష్, వెంకట్రావు, అసీనా బేగం, భాగ్యరేఖ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి లక్ష్యాలు ఏర్పరచుకోవాలి



మాట్లాడుతున్న కేశవరెడ్డి

టంగుటూరు: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ లక్ష్యాలు ఏర్పరచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ జాయింట్ డైరెక్టర్ కేశవరెడ్డి అన్నారు. గ్రామపంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ఆశయాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు సర్పంచులు, పంచాయతీ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను ఏపీఎస్ఐఆర్డీ జాయింట్ డైరెక్టర్ కేశవరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొని పంచాయతీలో అభివృద్ధి కోసం, నీటి సరఫరా, మహిళలు, పంచాయతీల అభివృద్ధి, పారిశుద్ధ్యం వంటి 9 రకాల అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ అమర్ బాబు, పిడబ్ల్యూ ఎస్ ఐఈసి కాజవలి, ఎంపీడీఓ దేవసేన కుమారి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల నుంచి రక్షణ కల్పించండి

టంగుటూరు: టీడీపీ నేతలు కబ్జా చేసిన భూమిని తిరిగి ఇప్పించి మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని బొట్ల సుబ్బారావు టంగుటూరు పోలీసులకు పోస్టు ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా మండలంలోని కందులూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జోన్ 5 ఇంచార్జ్ బొట్ల రామారావు చెందిన పట్టా భూమి సర్వే నెంబర్ 385/2 లో 45 సెంట్ల భూమిని టీడీపీ నేతలు కబ్జా చేసి ఆ భూమిలోని మట్టిని తవ్వి ఇతర గ్రామాలకు తరలిస్తున్నారన్నారు. దీన్ని తాను అడ్డుకునేందుకు ప్రయత్నించగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలతో తొక్కి చంపుతామని బెదిరించారన్నారు. వెంటనే పోలీసులు తగు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన ఈ నెల 23 లోగా తగిన ధ్రువీకరణ పత్రాలతో సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ పి.సరోజిని తెలిపారు. మండలంలోని మునగలవారిపల్లెలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, రెడ్డిగారికొత్తపల్లె అంగన్‌వాడీ కేంద్రం-1 లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నలుగురు డ్రాపౌట్స్ బాలికలు కేజీబీవీలోకి



డ్రాపౌట్స్‌ను కేజీబీవీలో చేర్చుతున్న సీడీపీఓ, సూపర్‌వైజర్, ఎన్‌జీఓ

పామూరు: మండలంలోని వెంకటాపురం ఎస్సీకాలనీకి చెందిన నలుగురు డ్రాపౌట్స్‌ను శుక్రవారం పామూరు కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చేర్పించినట్లు సీడీపీఓ పి.సరోజిని, ఎంఈఓ గరికపాటి కరుణకుమారి తెలిపారు. ఇటీవల వెంకటాపురంలో ఎస్సీకాలనీలో పౌరహక్కుల దినోత్సవ నిర్వహించగా డ్రాపౌట్స్‌ను గుర్తించామన్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌సిచ్చి వారిని కేజీబీవీ పాఠశాలల్లో చేర్పించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో జీరో డ్రాపౌట్స్ లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లలను పనులకు పంపవద్దని పాఠశాలకు పంపాలన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం, ఉన్నతస్థానం, వ్యక్తిగతంగా ఆర్థికబలోపేతం సాధ్యపడుతుందన్నారు. బాల్యవివాహాలు చేస్తే వారిపై కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎన్‌జీఓ షేక్.నాయబ్‌రసూల్, షాన్‌వాజ్, అంగన్‌వాడీ కార్యకర్త అమల పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వ్యవసాయాన్ని దండగ కాదు పండుగలా మార్చి రైతు సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తే కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రైతు పోరుబాటలో పాల్గొనేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీగా ఒంగోలుకు తరలి వెళ్తున్న సందర్భంగా ఆయన వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ రైతులను మోసం చేయడం చంద్రబాబు నైజమని, అదే రైతుకు మేలు చేయడం జగనన్న నైజమని కొనియాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న రూ.20 వేల ఊసే లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, మసనం వెంకట్రావులు కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, తాండ్ర రామ్మూర్తి, షేక్ కరీం, షేక్ సుల్తాన్, సయ్యద్ ఆబిద్‌ఆలీ, కొట్టే జాలయ్య, మాదాల శంకర్, పి.శ్రీనివాసులరెడ్డి, సాయికోటి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కృత్తికా మహా దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి



కృత్తికా దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని కె.బిట్రగుంట పంచాయతీలోని కాలభైరవ స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి కృత్తికా దీపోత్సవం వైభవంగా సాగింది. తమిళనాడు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి రామ్మోహనరావు ఆధ్వర్యంలో మొదట నూతనంగా నిర్మించిన ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. తరువాత నూతన యాగశాలను ప్రారంభించి హోమాలు చేశారు. చివరగా నూతనంగా నిర్మించిన మహా దీపస్తంభంపై అరుణాచలం దేవస్థానంలో జరిగే కృత్తికా దీపోత్సవం సమయానికి సరిగ్గా ఆరుగంటలకు దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పాపిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ దీపం సంక్రాంతి వరకు నిరాటంకంగా వెలుగుతుందని, ఆ ప్రకారం ఏర్పాట్లు చేశామని వివరించారు. కార్యక్రమంలో భాగంగా కాలభైరవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. దీపోత్సవాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జోత్స్నాదేవి

కనిగిరిరూరల్: రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు, మేలైన ఉత్పత్తులను పొందాలని ఏఓ పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని బడుగులేరు మరియు యడవల్లి గ్రామములో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర పరిధిలో రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ, పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ కంది, వరి, మినుము పంటల్లో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు. రైతులందరికీ కందిలో వెర్రి తెగులు గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పంటల బీమాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు ఎస్ .రాజేష్, గ్రామ పశువర్ధక సహాయకులు జి.సంధ్య, రైతులు పాల్గొన్నారు.

గుట్టుగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- టీడీపీ సానుభూతిపరులను ఏకగ్రీవం చేసే పనిలో రెవెన్యూ అధికారులు

మర్రిపూడి: మండలంలోని 13 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఎన్నిక నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. అధికార పార్టీ నాయకులకు మద్దతుగా నిలుస్తూ, వారి కొమ్ము కాస్తున్నారు. మండలంలో ఎన్ని నీటి సంఘాల ఓట్లు ఉన్నాయి, ఏ నీటి సంఘానికి ఎంతమంది ఓటర్లు ఉన్నారు? రెవెన్యూ అధికారులకు సైతం తెలియదంటే ఆశ్చర్యం కలుగుతుంది. గ్రామాల్లో ఓటర్లకు ముందస్తు సమాచారం అందించడంలో భాగంగా కనీసం దండోరా కూడా వేయించలేదు. ఓటరు స్లిప్‌లు సైతం పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు అధికారులే గుట్టుగా నిర్వహించారు. కనీసం పత్రికా విలేకర్లకు సైతం సమాచారం ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులకు రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తున్నారు. అధికశాతం తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులను ఏకగ్రీవం చేయాలని యోచనలో రెవిన్యూ అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం మౌతున్నాయి. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ జ్వాలా నరసింహారావును వివరణ కోరగా...ఎన్నికలకు సంబంధించి సమావేశాలు నిర్వహించామని తెలిపారు. అయితే మండలంలో నీటి సంఘాల ఓట్లు ఎన్ని ఉన్నాయో తెలియదని చెప్పడం గమనార్హం.

హనుమంతునిపాడు: మండలంలో మూడు ఇరిగేషన్ చెరువుల కింద నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. దొడ్డిచింతల ఇరిగేషన్ చెరువు కింద హాజీపురం 2 ప్రాదేశికాలు, దొడ్డిచింతల 4 ప్రాదేశికాలోను 852 ఓట్లు, నందనవనం 6 ప్రాదేశికాలోను 270 ఓట్లు, తిమ్మారెడ్డిపల్లి చెరువు కింద 6 ప్రాదేశికాల్లో 80 మంది రైతులకు ఓట్లున్నట్లు తెలిపారు. మూడు ఇరిగేషన్ చెరువుల కింద 18 ప్రాదేశికాలున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు.మధ్యాహ్నం 1 గంట వరకు నీటి సంఘాల సభ్యులను ఎన్నిక జరుగుతుంది. సభ్యుల ఎన్నిక అనంతరం సాయంత్రం నీటి సంఘాల ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారని వివరించారు.

పీసీపల్లి: మండల పరిధిలోని 10 చెరువులకు ఎన్నికలు శనివారం నిర్వహించనున్నారు. ఆయకట్టు పరిధిలోని రైతులు ప్రెసిడెంట్‌ను ఎన్నుకోనున్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు



విప్పగుంటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పుల్లారావు



అయ్యలూరివారిపల్లెలో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని అయ్యలూరివారిపల్లెలో శుక్రవారం మీభూమి మీహక్కు కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి 6 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అధిక శాతం ఆన్‌లైన్ కోసం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్యాల భారతీనారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని రామాయిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. సదస్సులో భూమి ఆన్‌లైన్ చేయాలని 3, వ్యవసాయ భూమి కావాలని 3, శ్మశానం భూమి కోసం ఒకటి, భూ ఆక్రమణలు తొలగించాలని 2 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. డీటీ కె.కిషోర్‌రెడ్డి, సర్వేయర్ కాకర్ల రమణయ్య, దేవదాయ శాఖ అధికారి శివశంకర్, వీఆర్‌ఓ పరుశురాం, రెవెన్యూ సిబ్బంది షేక్ రసూల్, సైదులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. మండలంలోని దూబగుంట్లలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి 15 అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా మ్యుటేషన్లకు అధికసంఖ్యలో అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ స్నేహ, పీఎస్ నాగేశ్వరరావు, పి.వెంకట్రావు, ఉడుముల ప్రభాకర్, ఎన్‌డోమెంట్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సులు సద్వినియోం చేసుకోండి

పొన్నలూరు: మండలంలోని విప్పగుంటలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లారావు పలు సమస్యలపై రైతులు దగ్గర నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని భూ సమస్యలతో పాటు, కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బీ, అడంగల్ పొందడానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఐ నరసయ్య, ప్రజలు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని చిమటలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జ్వాలా నరసింహారావు తెలిపారు. మ్యూటేషన్ కోసం 7 దరకాస్తులు, ఆన్‌లైన్ కరెక్షన్‌కు 4, రీప్లేస్‌మెంట్ కోసం 5, ల్యాండ్ సర్వే కోసం ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ప్రకాష్, వీఆర్‌ఓ ఏడుకొండలు గ్రామస్తులు పాల్గొన్నారు.



చిమటలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ జ్వాలా నరసింహారావు



రామాయిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ దిలీప్‌కుమార్



దూబగుంట్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

నేడు దత్త జయంతి

కనిగిరిరూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ శనివారం దత్తాత్రేయ స్వామి జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవక సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మాలు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామికి పంచామృత అభిషేకాలు, సామూహిక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భగవాన్ కాశీనాయన ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లు

కనిగిరిరూరల్: భగవాన్ కాశీనాయన ఆరాధన మహోత్సవం ఈ నెల 15 న జరగనున్న నేపథ్యంలో ఆరాధన మహోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని కాశీనాయన స్వామి ఆలయ పరిసర ప్రాంతాలను ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, సత్వర శానిటేషన్ కార్యక్రమాలు కూడా చేపడుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పులి విజయలక్ష్మి, శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, ఆలయ కమిటీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.